క్లుప్తంగా

కాంగ్రెస్‌కు కార్యకర్తలే బలం



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన పటేల్ రమేష్‌రెడ్డి, పరశురాములు

సూర్యాపేట : కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలమని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు పాలడుగు పరశురాం మాదిగ కాంగ్రెస్ పార్టీలో చేరగా ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే చరిత్ర కాంగ్రెస్ పార్టీకే సాధ్యమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై ప్రతి ఒక్కరూ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. దేశ భవిష్యత్తును మార్చే ఎన్నికలు త్వరలో జరగబోతున్నాయని, ప్రజలంతా ఆశీర్వదించి కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరిన పాలడుగు పరశురామ్‌తో పాటు పలువురు.. తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డితో కలిసి హైదరాబాద్‌లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆగస్టు 15లోపు హామీలను అమలు చేయాలి

నాగారం : ఆగస్టు 15లోపు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేని పక్షంలో హరీష్‌రావు సవాలును సీఎం రేవంత్ రెడ్డి స్వీకరించాలని ఎంపీపీ కూరం మణివెంకన్న అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లో ఎన్నికల హామీలను అమలు చేస్తామని చెప్పి నేటికీ అమలు చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. అమలుకు సాధ్యం కాని హామీలను ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తెలిపారు. ఆగస్టు 15లోగా సీఎం రేవంత్‌రెడ్డి రూ.2లక్షల రుణమాఫీ, రూ.4వేలకు ఆసరా పింఛన్ల పెంపు లాంటి హామీలను పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ఆమెతో బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

నేడు కార్నర్ మీటింగ్

తిరుమలగిరి : తిరుమలగిరి మండల కేంద్రంలో శనివారం సాయంత్రం 7 గంటలకు జరిగే కార్నర్ మీటింగ్‌ను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సంకెపల్లి కొండల్‌రెడ్డి కోరారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్నర్ మీటింగ్‌కు భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మునుగోడు శాసన సభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్, పార్లమెంటు అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

ముగిసిన జాతర



జాతరలో పాల్గొన్న భక్తులు

చివ్వెంల : పులితండా గ్రామంలో గిరిజనుల ఆరాధ్యదైవం శ్రీచాంపూలాల్ జాతర శుక్రవారం ముగిసింది. గత రెండు రోజులుగా జరుగుతున్న జాతరకు రెండవ రోజు భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారికి నైవేద్యం వండి సమర్పించారు. వేడుకల్లో ఎంపీపీ ధరావతు కుమారి బాబు నాయక్, ఎంపీటీసీ గుగులోతు మంత్రి, మాజీ సర్పంచ్‌లు గుగులోతు కవిత, ధరావతు సుజాత తదితరులు పాల్గొన్నారు.

రైతులు, హమాలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

అర్వపల్లి : కుంచమర్తి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు, హమాలీలకు వైద్యసిబ్బంది శుక్రవారం ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాసర్లపహాడ్ పల్లెదవాఖాన ఏఎన్ఎం తప్పెట్ల నాగరాణి మాట్లాడారు. ఎండల దృష్ట్యా వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులు, హమాలీలకు సూచించారు. వడదెబ్బ లక్షణాలు, నివారణ చర్యల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్త పగిళ్ల విజయ, వీఓఏ మన్నె సుజాత, రైతులు, నిర్వాహకులు లింగరాజు, కృష్ణ, వెంకన్న, శివ, వీరయ్య, రాజు, వెంకటమ్మ, సరిత, మంగమ్మ, లలిత, మల్లమ్మ పాల్గొన్నారు.



కుంచమర్తిలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న వైద్యసిబ్బంది

సొంతింటి కల నెరవేరేనా..

- పదేళ్లుగా సొంతింటి కోసం ఎదురు చూస్తున్న నిరుపేదలు
- కొన్నిచోట్ల డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం పూర్తయినా లబ్ధిదారులకు జరగని పంపిణీ
- పలు గ్రామాల్లో బిల్లులు అందక పనులను నిలిపేసిన కాంట్రాక్టర్లు



గోరంట్లలో పిల్లర్ల దశలో నిలిచిపోయిన పనులు



పోలుమల్లలో స్లాబ్ వరకు పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇల్లు

మద్దిరాల : పేదలకు ఇళ్లు అందించి వారి సొంతింటి కల నెరవేర్చాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించింది. కానీ ఇళ్ల నిర్మాణం నత్తనడకన సాగడం, పనులు పూర్తయినా ఇళ్ల పంపిణీ జరగకపోవడంతో ఇళ్లు లేని నిరుపేదలకు పదేళ్లుగా ఎదురుచూపులు తప్పలేదు. తుంగతుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా 724 డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరయ్యాయి. మొదటి విడతలో 274 గృహాలు మంజూరు కాగా.. అందులో 41 ఇళ్లను రద్దు చేశారు. కొన్ని గ్రామాల్లో నిర్మాణాలు పూర్తయినా ఇళ్ల ప్రారంభానికి నోచుకోలేదు. రెండో విడతలో మంజూరైన గృహాల నిర్మాణాలకు వ్యయం పెరిగిందని కాంట్రాక్టర్లు పనులను అసంపూర్తిగా వదిలేశారు.

తుంగతుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా ఇళ్ల వివరాలు..

మండలం	పనులు ప్రారంభించినవి	పూర్తయినవి	నిర్మాణంలో ఉన్నవి
తిరుమలగిరి	60	0	60
మద్దిరాల	155	75	80
నూతనకల్లు	64	32	32
అర్వపల్లి	32	32	0
నాగారం	125	125	0
తుంగతుర్తి	18	18	0

తుంగతుర్తిలో 18 గృహాలను నిర్మించగా పంపిణీ చేయకపోవడంతో లబ్ధిదారులు వాటిని ఆక్రమించుకున్నారు. అర్వపల్లి మండలంలో 32 ఇళ్లు మంజూరు కాగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మిగతా మండలాల్లో అధికారులు పలుమార్లు అర్హులను గుర్తించినప్పటికీ పంపిణీ చేయట్లేదు. దీంతో లబ్ధిదారులు సొంతింటికి దూరమవుతున్నారు.

ప్రజాధనం దుర్వినియోగం..

అసంపూర్తిగా వదిలేసిన ఇళ్ల నిర్మాణంలో కంపచెట్లు పెరిగాయి. ఆ గృహాలు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతున్నాయి. డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయకపోవడంతో రూ.వేల కోట్ల ప్రజాధనం దుర్వినియోగమవుతోందని, నిర్మాణాలను త్వరగా పూర్తిచేయించి అన్నింటినీ పంపిణీ చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వానికి నివేదికలు పంపాం

డబుల్ బెడ్ రూం ఇళ్లను పూర్తి చేసేలా కాంట్రాక్టర్లతో మాట్లాడాం. గతంలో నిర్మాణం చేపట్టిన వాటికి ఏడాదిన్నరకు బిల్లులు వచ్చాయి. ఈ ప్రభుత్వంలో బిల్లులు మంజూరవుతాయో లేదోనని కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. అసంపూర్తిగా ఉన్న గృహాల వివరాలపై నివేదికలను ప్రభుత్వానికి అందజేశాం. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– పవన్ ఆర్అండ్‌బీ, ఈఈ

సొంతింటి కల నెరవేర్చాలి



అర్హులైన ప్రతి నిరుపేద వాడికి సొంతింటి కలను నెరవేర్చాలి. గత ప్రభుత్వ పదేళ్ల కాలంలో ఇళ్లు రాక పేదలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటి పథకం ద్వారా ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్లను కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. వెంటనే ఈ పథకాన్ని అమలు చేసి పేదోడి కలను నెరవేర్చాలి.

– పులుగుజ్జ యాకయ్య, కుక్కడం

మానసిక ప్రశాంతతతోనే మనిషి మనుగడ

- శ్రీజగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థానం పీఠాధిపతి విద్యాశంకర భారతి మహాస్వామి



విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న స్వామీజీ

భానుపురి : ప్రపంచంలో మానసిక ప్రశాంతతకు మించినది మరొకటి లేదని పుష్పగిరి పీఠాధిపతి శ్రీ జగద్గురు శంకరాచార్య మహాస్వామీజీ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషిమాత దేవాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ మానస దేవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని భక్తులనుద్దేశించి మాట్లాడారు. పరమశివుడు ఒకానొక సమయంలో వైరాగ్యంతో ఉంటూ ఒకేసారి అమితానందాన్ని పొందడంతో మానసా దేవి ఉద్భవించిందని తెలిపారు. మనిషి ఆర్థిక, ఆరోగ్య, ఉద్యోగం వంటి ఎన్ని రంగాల్లో తృప్తిగా ఉన్న మానసిక ప్రశాంతత లేకపోతే ఆ జీవితానికి మనుగడ లేదన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలన్నారు. ఇంతకుముందు స్వామీజీకి దేవాలయ ప్రధాన అర్చకుడు శర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రతిష్ఠ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీపుష్పగిరి శంకరాచార్య మహా సంస్థాన పరిపాలిత దేవాలయాల ధర్మాధికారి ఎంఎల్ఆర్ గుప్తా, దేవాలయ అధ్యక్ష, కార్యదర్శులు నూక వెంకటేశం గుప్త, బ్రాహ్మాండ్లపల్లి మురళీధర్, కోశాధికారి రాంమూర్తి, కమిటీ సభ్యులు నరేంద్రుని విద్యాసాగర్ రావు, భేలిదే అశోక్, పబ్బ ప్రకాశ రావు, కొత్త మల్లికార్జున్, రామయ్య, నామిరెడ్డి పాపిరెడ్డి, సోమయ్య, ముదిరెడ్డి లింగారెడ్డి, గోపారపు రాజు, దేవాలయ అర్చకులు శివరామకష్ణ శర్మ, వంశీకృష్ణ శర్మ, కృష్ణమాచార్యులు, మేనేజర్ పురుషోత్తం పాల్గొన్నారు.

ప్రజలు భక్తిభావం కలిగి ఉండాలి



విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొన్న రాంరెడ్డి దామోదర్ రెడ్డి, తదితరులు

చివ్వెంల : ప్రజలు భక్తి భావం కలిగి ఉండాలని సూర్యాపేట మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పాశ్యానాయక్ తండాలో నిర్వహించిన శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. గ్రామ ప్రజలందరికీ స్వామి ఆశీస్సులు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, కొప్పుల వేణారెడ్డి, ధరావతు వీరన్న నాయక్, పద్మమంగ్యా, విజయ, శ్రీను, వీరన్న, వాలు, రమేష్, లాలు, మల్సూర్, జాను, సుక్యా, పెటయ్య, రవీందర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మేడే వేడుకలను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న మల్లు నాగార్జున్ రెడ్డి

సూర్యాపేట : ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను వాడవాడలా ఘనంగా నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి అన్నారు. శుక్రవారం కృష్ణా టాకీస్ ఏరియాలోని సీతారాంపురంలో నిర్వహించిన పార్టీ వన్ టౌన్ కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మిక వర్గంపై అనేక భారాలు మోపుతోందన్నారు. కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొస్తుందని తెలిపారు. కార్మికులకు పని గంటలు పెంచి హక్కును కాల రాస్తోందని అన్నారు. విపరీతంగా ధరలు పెంచి పేదలపై భారం మోపిందని విమర్శించారు. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని రోజురోజుకూ బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న బీజేపీని రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. సీపీఎం పట్టణ కమిటీ సభ్యుడు షేక్ సైదులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎల్గూరి గోవింద్, దండ వెంకట్ రెడ్డి, సీపీఎం వన్ టౌన్ కార్యదర్శి వల్లపు దాసు, సాయికుమార్, పట్టణ కమిటీ సభ్యులు మామిడి పుల్లయ్య, అర్వపల్లి లింగయ్య, మామిడి సుందరయ్య, గండమల్ల భాగ్యమ్మ, పిట్టల రాణి, శశిరేఖ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



నూతనకల్‌లో పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

నూతనకల్ : భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపునకు కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అల్లునూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాలు, ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీల కుమ్మక్కు రాజకీయాలకు ప్రజలు ఓటు ద్వారా బుద్ధిచెప్పి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, క్లెం కృష్ణారెడ్డి, బంటు బద్రి, జాకీర్‌హుస్సేన్, బద్దం వెంకట్‌రెడ్డి, బంటు లింగయ్య, ఇటికాల వెంకన్న, పిట్టల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి నివాళులు

తిరుమలగిరి : తాటిపాముల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బందెల సోమయ్య శుక్రవారం మృతి చెందారు. దీంతో మృతుడి భౌతికకాయాన్ని తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్ సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాలకుర్తి రాజయ్య, పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, జమ్మిలాల్, రవీందర్‌రెడ్డి, అంబేద్కర్, ఎర్ర యాదగిరి, అంజయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ప్యాడీ క్లీనర్ల కొరత

- గాలిపంకలను ఆశ్రయిస్తున్న రైతులు
- పెరుగుతున్న ఆర్థికభారం



కొత్తగూడెం ఐకేపీలో ట్రాక్టర్ పంకతో వడ్లు పడుతున్న రైతులు

తుంగతుర్తి : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్యాడీ క్లీనర్ల కొరతతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో 16 ఐకేపీ కేంద్రాలు, మూడు పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని శుభ్రం చేసేందుకు ప్రతి కేంద్రానికి ఒక ప్యాడీ క్లీనర్ యంత్రాన్ని అందించారు. అయితే ఈ యాసంగి సీజన్‌లో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం అధిక మొత్తంలో వచ్చింది. రైతుల ధాన్యాన్ని క్లీనింగ్ చేస్తేనే కొనుగోలు చేస్తామని ప్రభుత్వం నిబంధన పెట్టింది. అలాగే ప్యాడీ క్లీన్ చేసిన తరువాతే వ్యవసాయశాఖ అధికారులు ధాన్యంలో తేమ శాతాన్ని చూస్తున్నారు. కానీ కేంద్రానికి ఒకటే ప్యాడీ క్లీనర్ యంత్రం ఉండటంతోపాటు, అవి సక్రమంగా పనిచేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో ప్యాడీ క్లీనర్ రోజుకు 100 నుంచి 150 బస్తాల వరకు మాత్రమే ధాన్యాన్ని శుభ్రం చేస్తుంది. అది కూడా పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా ఉంటేనే. ధాన్యాన్ని త్వరగా క్లీన్ చేయాలనే ఉద్దేశంతో కొంత మంది రైతులు విధిలేని పరిస్థితుల్లో ట్రాక్టర్లకు ఏర్పాటు చేసిన గాలిపంకలను ఆశ్రయిస్తున్నారు. గాలిపంకల వద్ద ధాన్యాన్ని శుభ్రం చేయిస్తే వారు గంటకు రూ.700 నుంచి రూ.800 వసూలు చేస్తున్నారు. అలాగే ప్యాడీ క్లీనర్ ద్వారా ధాన్యాన్ని శుభ్రం చేస్తే ముగ్గురు కూలీలు అవసరం ఉంటుంది. కానీ గాలిపంకల వద్ద ధాన్యాన్ని శుభ్రం చేయిస్తే ఐదు నుంచి ఆరుగురు కూలీల అవసరం ఉంటుంది. దీంతో రైతులపై అదనంగా ఆర్థిక భారం పడుతోంది. ఐకేపీలకు ఎక్కువ ధాన్యం రావడంతో ప్యాడీ క్లీనింగ్ చేయడం ఇబ్బందిగా మారిందని, ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలకు అదనంగా ప్యాడీ క్లీనర్లను సమకూర్చాలని రైతులు కోరుతున్నారు.

అదనంగా ప్యాడీ క్లీనర్లను ఏర్పాటు చేయాలి



ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అదనంగా ప్యాడీ క్లీనర్లను ఏర్పాటు చేయాలి. ఉన్న ఒక్క ప్యాడీ క్లీనర్ కూడా నడవడం లేదు. ప్యాడీ క్లీనర్ల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్యాడీ క్లీనర్ కొరతతో రైతులు ప్రైవేటుగా ట్రాక్టర్ ఫ్యాన్ వద్ద గంటకు రూ.700 చొప్పున చెల్లించి వడ్లను శుభ్రం చేయించుకుంటున్నారు.

– బండి సత్యనారాయణ, రైతు, కొత్తగూడెం

రైతులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవు



నూతనకల్ : గుండ్లసింగారంలో ధాన్యం రాశులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ



మద్దిరాల : ముకుందాపురంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్



అర్వపల్లి : కొమ్మాలలో ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న ఏఈఓ సత్యం

నూతనకల్ : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని డీఆర్‌డీఓ మధుసూదనరాజు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గుండ్లసింగారం, యడవెళ్లి ఐకేపీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లోని ధాన్యం రాశులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకు తేమశాతం కలిగిన ధాన్యానికి వెంటనే కాంటాలు వేయాలని అన్నారు. కాంటాలు వేసిన బస్తాలను సకాలంలో మిల్లులకు తరలించాలని సూచించారు. రైతుల ఖాతాల్లోకి సకాలంలో ధాన్యం డబ్బులు పడే విధంగా ఆన్‌లైన్ చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మురళీబాబు, ఏపీఎం కర్ణాకర్, ఏఈఓ శ్రావణి, వెలుగు సీసీలు, ఐకేపీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కాంటాలను వేగవంతం చేయాలి

మద్దిరాల : కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ధాన్యం కాంటాలను వేగవంతం చేయాలని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ముకుందాపురంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. తేమ శాతం 17లోపు వచ్చిన ధాన్యంను కాంటాలు వేసి లోడ్‌లను మిల్లుకు తరలించాలని అన్నారు. అనంతరం నిర్వాహకుల వద్ద ఉన్న పలు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఓ వికాస్ పాటిల్, ఏపీఎం మైసయ్య, సీసీ రమేష్, నిర్వాహకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం ఆరబెట్టి, శుభ్రంచేసి తేవాలి

అర్వపల్లి : రైతులు వరిపంట కోయగానే ధాన్యాన్ని ఆరబెట్టి, శుభ్రంచేసి కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే మద్దతు ధర లభిస్తుందని తిమ్మాపురం క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి నేరెళ్ల సత్యం అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొమ్మాల పీఏసీఎస్ కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించారు. 17 శాతం వరకు తేమ ఉన్న ధాన్యాన్ని ఎంపిక చేసి కాంటాలు వేయాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో కేంద్రం ఇన్‌చార్జ్ ఆడెపు శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

బొడ్రాయి, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు



ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న గ్రామస్తులు

మద్దిరాల : మండల పరిధిలోని కుక్కడంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మూడవ రోజు శ్రీఆంజనేయ స్వామి, శివాలయాల వద్ద ఏర్పాటు చేసే ధ్వజస్తంభాలకు జలాభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజ స్తంభాలను ప్రతిష్ఠించారు. అదే విధంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన చేసి గ్రామంలోని శివాలయంలో శివలింగాన్ని, నంది విగ్రహాన్ని, మహంకాళమ్మ, మారమ్మ, కట్టమైసమ్మ దేవతల నూతన విగ్రహాలను ఏర్పాటు చేశారు.

ప్రతి ఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలి..

ప్రతి ఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండల పరిధిలోని కుక్కడంలో జరుగుతున్న ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు యాదవ్, మద్దెల భిక్షపతి, వల్లపు కళింగం, మాజీ సర్పంచ్ వాసుదేవరెడ్డి, తాజా మాజీ సర్పంచ్ గుండ్ల కొమరయ్య, బర్పటి ప్రవీణ్, మల్లయ్య, జలగం అచ్చయ్య, లింగయ్య, యాకయ్య, సోమయ్య, రామనర్సు, చంద్రయ్య, బొమ్మెర వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సామేల్



కుక్కడంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన..

ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి



ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

తుంగతుర్తి : పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో శుక్రవారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేపాక సాయిబాబు మాట్లాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించారు. గతంలో భువనగిరి ఎంపీగా బూర నర్సయ్యగౌడ్ చేసిన అభివృద్ధికి సంబంధించిన ప్రచార కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గాజుల మహేందర్, గోపగాని రమేష్‌గౌడ్, వెంకటనారాయణ, పులిపంపుల సైదులు, ఉప్పుల లింగయ్య, అంబటి రమేష్, సాయికృష్ణ, నవీన్, నాగయ్య, అంతయ్య, వీరయ్య, శ్రీనివాస్, వెంకన్న, మనోజ్, ఉపేందర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో మూడోసారీ బీజేపీదే అధికారం

కోదాడ రూరల్ : కేంద్రంలో మూడోసారి కూడా బీజేపీ అధికారంలోకి రావడం, నరేంద్రమోదీ మరోసారి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయడం ఖాయమని బీజేపీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం కోదాడ పట్టణ పరిధిలోని తమ్మర సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల నిధులను కేటాయించిందన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే నల్లగొండ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని నియోజకవర్గాలను మరింత అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు చాడ శ్రీనివాసరెడ్డి, జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి, కోదాడ కన్వీనర్ కనగాల నారాయణ, నాయకులు పాల్గొన్నారు.

ఓటరు స్లిప్‌ల పంపిణీ

తుంగతుర్తి : వచ్చే నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మండలంలోని వివిధ గ్రామాల్లో బీఎల్‌ఓలు ఓటరు స్లిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరుగుతూ ఓటరు స్లిప్‌లను పంపిణీ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌ఓలు లక్ష్మీబాయి, శారద, మాధవి, మంగమ్మ, ఉమ, మంజుల పాల్గొన్నారు.

మృతురాలికి నివాళి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన తోట కమలమ్మ శుక్రవారం మృతి చెందారు. దీంతో ఆమె మృతదేహానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్ నివాళులర్పించారు. మృతురాలి కుటుంబీకులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కందుల దశరథరామారావు, పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ చల్లా వేణుధర్‌రెడ్డి, తండ లింగమూర్తిగౌడ్, సందీప్‌రెడ్డి, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీ కూలీలకు సౌకర్యాలు ఏర్పాటు

నడిగూడెం : సిరిపురంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్ద కూలీలకు శుక్రవారం కనీస సౌకర్యాలైన టెంట్, తాగు నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్‌లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ఆర్.సతీష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువు మట్టి తరలింపు

నాగారం : నాగారం మండల పరిధిలోని ఫణిగిరి బౌద్ధ క్షేత్రం సమీపంలో ఉన్న చెరువు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా చెరువు మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. కొందరు వ్యక్తులు ఇటుక బట్టీల వ్యాపారులతో ఒప్పందాలు చేసుకొని చెరువు మట్టిని తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఇరిగేషన్ శాఖ అధికారులు మాత్రం తమకేమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి చెరువు మట్టిని ఇటుక బట్టీలకు తరలించకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఫణిగిరిలో ఇటుక బట్టీ వద్ద డంప్ చేసిన మట్టి